క్లుప్తంగా

నూతన వధూవరులకు ఆశీర్వాదాలు


ఆశీర్వాదిస్తున్న దద్దాల నారాయణ

హనుమంతునిపాడు: మండల పరిధి హాజీపురం గ్రామంలో శనివారం జరిగిన వేల్పుల వారి వివాహ వేడుకలో కనిగిరి నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. పెండ్లి కుమార్తె వేల్పుల రామయ్య వెంకట రత్నం కుమార్తె లక్ష్మీ ప్రసన్న, మల్లిఖార్జునరావు వేడుకలో పాల్గొని నూతన వధువరులను ఆశీర్వాదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ పార్టీ నాయకులు కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, మండల సర్పంచ్ సంఘ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతి రెడ్డి, నాయకులు గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, ఉపసర్పంచ్ ఏరువ వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ గొబ్బిళ్ల శ్రీనివాసులు, గుడిపాటిపల్లి ఎస్సీ నాయకులు కటికల వెంకటరత్నం, చిట్యాల నాగార్జున్‌రెడ్డి, రోశయ్య, రాములు, మహేంద్ర, నాగయ్య, రవీంద్ర తదితరులు ఉన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మర్రిపూడి: పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసిన ఘటన మండలంలోని కాకర్లగ్రామంలో శనివారం జరిగింది. ఎస్సై రమేష్ బాబు వివరాల మేరకు.. మండలంలోని కాకర్ల గ్రామశివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం తెలుసుకున్న ఎస్సై, సిబ్బందితో పేకాట స్థావరంపై ఆకస్మిక దాడిచేశారు. ఈ దాడిలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న రూ. 10.840 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని పేకాట, కోడిపందేలు లాంటి జూదాలకు తావులేదని, అలాంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

హనుమంతునిపాడు: ఈనెల 3వ తేదీ సోమవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఉన్నట్లు ఎంపీడీఓ ఎం.రంగసుబ్బారాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ గాయం సావిత్రి అధ్యక్షతన జరుగుతుందన్నారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన ప్రకటనలో కోరారు.

ఆటోల్లో పరిమితికి మించి ఎక్కిస్తే చర్యలు

పీసీపల్లి: పరిమితికి మించి ఆటోల్లో ఎక్కువ మందిని ఎక్కించరాదని.. అలా ఎవరైనా ఎక్కిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై కోటయ్య హెచ్చరించారు. శనివారం మండల పరిధిలో ఆటోల్లో తోలుతున్న వారికి స్థానిక పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది ఆటో డ్రైవర్లు ప్రయాణికులు పట్ల అసభ్యంగా ప్రవర్తించారని, తమ దృష్టికి వచ్చిందని మరోసారి ఇలా జరిగితే అలాంటి ఆటోలను సీజ్ చేసి లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. అదేవిధంగా మద్యం తాగి నడపకూడదని ఆయన హెచ్చరించారు.

సిబ్బందితో వైద్యుడి దురుసు ప్రవర్తన



టంగుటూరు: మండలంలోని కాకుటూరివారిపాలెం గ్రామంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మహిళా ఎంఎల్‌హెచ్‌పీ మహిళా సిబ్బందిపై శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు బాలాజీ అశోక్ దురుసుగా ప్రవర్తించాడు. బాధితురాలి వివరాల మేరకు.. కాకుటూరివారిపాలెం సబ్ సెంటర్‌లో మమత ఎంఎల్‌హెచ్‌పీగా విధులు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో 104 వాహనంలో వైద్య సేవలు అందించేందుకు టంగుటూరు పీహెచ్‌సీ వైద్యుడు బాలాజీ అశోక్ వచ్చాడు. వైద్యుడితో సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు లేకపోవడంతో పని ఒత్తిడి పెరిగిందని తెలిపింది. దీంతో వైద్యుడు బాలాజీ అశోక్ పెద్దగా మాట్లాడుతూ రికార్డులు పరిశీలన చేయాలని సబ్ సెంటర్‌లోకి వెళ్తూ కోపంగా కుర్చీని కాలితో తన్నాడు. కావాలనే నన్ను టార్గెట్ చేసి వైద్యుడు తరచూ మాట్లాడుతున్నాడని, ఈ విషయమై జిల్లా ఉన్నాధికారులకు ఫిర్యాదు చేస్తానని మమత తెలిపారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

కొండపి: పొగాకు బ్యారన్ దగ్ధమైన ఘటన జరుగుమల్లి మండలంలోని వర్దినేనివారి పాలెం గ్రామంలో శనివారం జరిగింది. కొండపి అగ్నిమాపకాధికారి వెంకట్రావు వివరాల మేరకు.. ప్రకారం గ్రామానికి చెందిన గాలి కృష్ణమూర్తి బ్యారన్‌లో అల్లిక కర్రజారి మొద్దు గొట్టంపై పడటంతో మంటలు చెలరేగాయని తెలిపారు. వెంటనే అక్కడ ఉన్న స్థానికులు కొండపి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వెంటనే వారు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు 2.75 లక్షల ఆస్తి నష్టం జరిగిందని ఆయన తెలిపారు.

తొలి దశ.. భవిష్యత్‌కు దిశ!

- పదిలో వంద శాతం ఫలితాల కోసం ప్రత్యేక ప్రణాళిక
- మార్చి 17 నుంచి పది పబ్లిక్ పరీక్షలు
- ఉదయం, సాయంత్రం ప్రత్యేక స్టడీ అవర్స్
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- పరీక్షలకు 3100 మంది విద్యార్థులు


పామూరులో స్టడీ అవర్స్ పర్యవేక్షిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

సీఎస్‌పురం (పామూరు):

విద్యార్థి దశలో పదో తరగతి తొలిమెట్టు.. దశ, దిశను నిర్దేశిస్తుంది. తొలిమెట్టే సరిగా పడితే భవిష్యత్ అంతా బాగుంటుందనేది విద్యార్థుల అభిప్రాయం. తల్లిదండ్రులదీ అదే ఆశ. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలనే కాంక్ష విద్యార్థుల్లోనే కాకుండా ఉపాధ్యాయుల్లోనూ బలంగా ఉంటోంది. దీనికి అనుగుణంగానే టెన్త్ పరీక్షల కోసం సన్నద్ధం చేసేందుకు కసరత్తు మొదలుపెట్టారు. టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు మాత్రమే ట్రిపుల్ ఐటీ సీట్లు దక్కుతాయి. అదేవిధంగా ఎన్నో ప్రతిభా పురస్కారాలు, ఉపకార వేతనాలు లభిస్తాయి. అదేవిధంగా ప్రభుత్వ టాప్ జూనియర్ కళాశాలల్లో సీట్లు పొందడంతోపాటు, ఈ ఫలితాలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు రాయితీలు కల్పించేందుకు ఎంతో ఉపకరిస్తాయి. ఈనేపథ్యంలో టెన్త్‌లో మెరుగైన ఫలితాలు సాధనే లక్ష్యంగా చేపట్టిన 100 రోజుల ప్రణాళిక డిసెంబర్ నుంచి అమలుచేస్తుండగా వార్షిక పరీక్షలకు కేవలం మరో 45 రోజులు మాత్రమే ఉండటంతో ఈప్రక్రియ మరింత ప్రత్యేక శ్రద్ధతో నిర్వహిస్తున్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఆయా సబ్జెక్టలలో విద్యార్థులకు అర్థమయ్యేలా సులభతరంగా బోధిస్తూ మంచి వాతావరణాన్ని కల్పిస్తున్నారు.

ప్రత్యేక తరగతులు, స్లిప్ టెస్ట్‌లు..

టెన్త్ విద్యార్థులకు వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ఇప్పటికే 100 రోజుల ప్రణాళిక అమలుచేస్తుండగా, వార్షిక పరీక్షలు మరో 45 రోజులే ఉండటంతో దీనిని మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు ఉపాధ్యాయులు కృతనిశ్చయంతో పనిచేస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు, మళ్లీ సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్, స్లిప్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక పరీక్షల్లో విద్యార్థులకు వచ్చిన మార్కులకు ఆధారంగా వారిని గ్రూపులుగా విభజించి సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణనిచ్చి, మెళకువలు నేర్పి వారిని కూడా ఏ గ్రేడ్ విద్యార్థులుగా తీర్చిదిద్దడంపై ఉపాధ్యాయులు దృష్టి సారించారు. అదేవిధంగా గతంలో క్లాసుల్లో బోధించిన పాఠశాల సబ్జెక్టుల వారీగా రివిజన్ చేయిస్తున్నారు. కాగా అధిక శాతం పాఠశాలల్లో సబ్జెక్ట్ వారి ఉపాధ్యాయుల కొరత విద్యార్థులను వేధిస్తుండగా ఇతర సబ్జెక్టుల ఉపాధ్యాయులు వాటిని బోధిస్తున్నారు. కనిగిరి నియోజకవర్గంలో మొత్తం ఉన్నత పాఠశాలలు 80 ఉన్నాయి. 3100 పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

టాప్ ర్యాంక్ లక్ష్యంగా సాధన..



పాఠశాలలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం నిర్వహించే స్టడీ అవర్స్ ఎంతో ఉపయోగకరంగా న్నాయి. స్టడీ అవర్స్‌లో ఉపాధ్యాయులు సబ్జెక్టుల్లో ఏవైనా అనుమానాలు ఉంటే అప్పుడే నివృత్తి చేస్తున్నారు. టాప్ ర్యాంక్ లక్ష్యంగా కష్టపడి చదువుతున్నాం.

– సయ్యద్ రేష్మ, టెన్త్ విద్యార్థిని, పామూరు

సిలబస్ రివిజన్‌కు అవకాశం..



ఉదయం, సాయంత్రం రోజుకు ఒక్క సెబ్జెక్టు చొప్పున ప్రత్యేక తరగతులతో సిలబస్ రివిజన్‌కు అవకాశం ఏర్పడింది. ప్రత్యేక తరగతులతో పాఠశాలలో ఎక్కువ సమయం ఉండటం వల్ల ఆయా సబ్జెక్టుల టీచర్లు అందుబాటులో ఉంటున్నారు. దీనికి తోడు సైన్స్ పరీక్ష రెండు రోజుల పాటు నిర్వహించడం బాగుంది.

–ఎం.యోగీశ్వర్, టెన్త్ విద్యార్థి, పామూరు

గ్రూపులుగా విభజించి విద్యార్థులకు బోధన..



ఉపాధ్యాయులు విద్యార్థులను గ్రూపులుగా విభజించి ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదివిస్తున్నాం. దీని వలన విద్యార్థి అభ్యసన స్థితి ఉపాధ్యాయుడికి అర్థమై వెంటనే సబ్జెక్టు వారీగా కూడా విద్యార్థులకు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. విద్యార్థి అన్ని సబ్జెక్టుల్లో నిష్ణాతుడై ఉత్తమ ఫలితాలు సాధించేందుకు దోహదపడుతుంది.

ఎం.రామస్వామి, హెచ్‌ఎం, పామూరు

నూరుశాతం ఫలితాలకోసం ప్రత్యేకదృష్టి..



టెన్త్ పరీక్షల ఫలితాల్లో ప్రతి ప్రభుత్వ పాఠశాల నూరుశాతం ఫలితాలు సాధించే దిశగా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు 100 రోజుల ప్రణాళికను కచ్చితంగా అమలు చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్న స్టడీ అవర్స్ విద్యార్థులకు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. నూరుశాతం ఫలితాలను సాధించే దిశగా పనిచేస్తున్నాం.

– రాజాల కొండారెడ్డి, ఎంఈఓ, సీఎస్‌పురం

11 హెల్త్ పింఛన్ల తొలగింపు

హనుమంతునిపాడు: మండలంలో 14 గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న హెల్త్ పింఛన్లు 11 మంది లబ్ధిదారులను తొలగించారు. ఈ సందర్భంగా శనివారం ఎంపీడీవో ఎం.రంగసుబ్బరాయుడు మాట్లాడుతూ మండలంలో హెల్త్ సర్టిఫికెట్లు పొంది 18 మంది రూ.10 వేల వంతు ప్రతి నెల ఫింఛను తీసుకుంటున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో హెల్త్ పింఛన్ల పరిశీలన జరిగింది. జిల్లా అధికారులు ఏర్పాటు చేసిన వైద్య బృందం స్థానిక మెడికల్ అధికారి సమక్షమంలో ఆ పింఛన్లు పొందుతున్న లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య బృందం నిర్వహించిన పరీక్షలో 11 మంది అనర్హులుగా తెల్సినట్లు తెలిపారు. దీంతో ఈ నెలల నుంచి హెల్త్ పింఛన్లు నిలిపేసినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. తొలగించిన హెల్త్ పింఛన్ల జాబితాలో కూటాగుండ్ల గ్రామానికి చెందిన వేశపోగు ఇర్మియ్య, గాయం సుజాత, సానికొమ్ము తిరుపతమ్మ, నందనవనం గ్రామంలో కంది తిరుపతమ్మ, గిద్దా చిన్న పోలయ్య వాలిచర్లలో దమ్ము జయమ్మ, ఉస్తేల సలోమి, సాధు మార్తమ్మ, పెద్దగొల్లపల్లిలో వరికూటి జయమ్మ, హాజీపురంలో దారా విజయరాణి, ముప్పళ్లపాడులో దమ్ము సరస్వతి ఉన్నారు.

పని అడిగిన ప్రతి కూలీకి పని

పీసీపల్లి: మండల పరిధిలోని పని అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాలని ఎంపీడీవో ప్రభాకర్ శర్మ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు త్వరితగతిన ప్రారంభించి, వలస కూలీలను నివారించాలన్నారు. ప్రస్తుతం గ్రామంలో జరిగే పనులు ఫారం పాండ్స్, ఫిష్ పాండ్స్, పంట కాలువలు అమృత్ సరోవర్ పనులు సత్వరమే చేపట్టాలని సూచించారు. దినసరి వేతనం రూ. 280 నుంచి రూ. 300 కూలి వచ్చేలా అందరికీ పని కల్పించాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న గోకుల్ షెడ్‌ల నిర్మాణం సక్రమంగా జరగడం లేదని, పాత షెడ్లకే నిధులు డ్రా చేసేందుకు కొంతమంది ప్రజాప్రతినిధులు చూస్తున్నారన్నారు. అలాంటి వాటికి బిల్లులు పెట్టే ప్రసక్తే లేదన్నారు. నిర్మాణాలను రెండు రోజుల్లోపల అన్ని పూర్తి చేయాలనా ఆయన ఆదేశించారు.

విద్యార్థులకు అండగా 'ఫీజు పోరు'


ఫీజుపోరు వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నారాయణ యాదవ్, పార్టీ నేతలు

- ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలిన కూటమి సర్కార్
- ఈనెల 5న భారీ ర్యాలీతో కలెక్టర్‌కు వినతి
- ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పిలుపు


మాట్లాడుతున్న దద్దాల నారాయణ

కనిగిరిరూరల్: విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కూటమి ప్రభుత్వ మెడలు వంచడానికి వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందని వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో 'ఫీజు పోరు' వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. సమావేశంలో దద్దాల నారాయణ మాట్లాడుతూ ఈనెల 5వ తేది వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే ఫీజుపోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులు అన్యాయానికి గురవుతున్నారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మూడు త్రైమాసికాల్లో ఫీజు చెల్లించారన్నారు. 2014–19 టీడీపీ ప్రభుత్వంలో బకాయిలను కలుపుకుని అప్పుడు విద్యార్థులకు ఇవ్వాల్సిన రూ.4 వేల కోట్లను కూడా వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే విడుదల చేసిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అటకెక్కించదని విమర్శించారు. నాలుగు దఫాలుగా బకాయి పడిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకం కింద ఇవ్వాల్సిన రూ.3,900 కోట్లు తక్షణమే విడుదల చేయాలన్నారు.

8 నెలలంతా అబద్ధాలతోనే..

కూటమి సర్కార్ ఏర్పాడి 8 నెలలు అవుతున్నా.. ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్నారు. దీంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు ఒత్తిడికి గురిచేస్తున్నాయన్నారు. నారాయణ కళాశాల యాజమాన్యం ఒత్తిళ్లు తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలకు ప్పాలడిన ఘటనలు జరిగాయని తీవ్రంగా మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం, నేతలు ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలాయని ఘాటుగా విమర్శించారు. వైఎస్సార్ నేతలపై, సోషల్ మీడియాపై కేసులు పెట్టడమే పనిగా పెట్టుకుని.. రాష్ట్రంలో దుర్మార్గపు పాలన సాగిస్తున్నారని తీవ్రంగా ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈనెల 5న ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద జరిగే ఫీజుపోరును విజయవంతం చేయాలన్నారు. ఫీజు పోరు కార్యక్రమంకు కనిగిరి నియోజకవర్గం నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు, పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు, పార్టీ శ్రేణులు అందరూ అధిక సంఖ్యలో హాజరు కావాలని విన్నవించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ సాల్మన్ రాజు, మాజీ ఎంపీపీలు గాయం బలరాంరెడ్డి, భువనగిరి వెంకటయ్య, జీ బొర్రారెడ్డి, సూరసాని మోహన్‌రెడ్డి, ఒమేగా రామిరెడ్డి, ఆవుల భాస్కర్ రెడ్డి, డాక్టర్ రసూల్, ఆవుల కృష్ణారెడ్డి, నాయకులు సంగటి మహేంద్రారెడ్డి, అంబటి కొండారెడ్డి, గట్లా విజయ భాస్కర్‌రెడ్డి, దాసరి మురళీ, పులి శ్రీను, కటికల వెంకట రత్నం, పల్నాటి భాస్కర్‌రెడ్డి, మర్రి రాజు, జీ అనీల్, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, తూము వెంకట కృష్ణారెడ్డి, సిద్దారెడ్డి, గురుప్రసాద్, సీహెచ్ కిషోర్, రమణారెడ్డి, జీ ఆదినారాయణ రెడ్డి, పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, తిరుపతిరెడ్డి, రవీంద్రారెడ్డి, కొండారెడ్డి, కాసుల గురవయ్య, దమ్ము వెంకటయ్య, నాగమణి, భారతీ, షకీల, సుస్మిత, శీలం సుదర్శన్, పి నాగేశ్వరరావు, మూలే నారాయణరెడ్డి, నరేష్, వెంగళరావు గుప్తా, బత్తుల మాలి, సాంబిరెడ్డి, ఎస్ వెంకటేశ్వరరెడ్డి, రమేష్, గోనా జేమ్స్, బాలయ్య, వెంకటస్వామిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కేశవ, శ్రీకాంత్, చిన్న సుబ్బారాయుడు, ఎరుకలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి కాపులు నుంచి దరఖాస్తులు

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి మండలంలోని కాపు కులస్తులు కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చంద్రన్న స్వయం ఉపాధి పథకాలకు ఈనెల నేటి తేది నుంచి 6వ తేది వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రమణమూర్తి శనివారం ఒక ప్రకటనలో సూచించారు. కాపు కమ్యూనిటీలోని కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల్లోని అర్హులైన లబ్ధిదారులు ఏబీఎంఎంఎస్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

కొండపి:రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని పలువురికి గాయాలయ్యాయి. ఈఘటన కొండపిలోని టంగుటూరు రోడ్డులో రంగసాయి వాగు సమీపంలో శనివారం సాయంత్రం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని పెరిదేవి గ్రామానికి చెందిన అంగలకుర్తి సూరిబాబు తన స్నేహితుడు రవిబాబుతో కలిసి పనుల నిమిత్తం కొండపికి ద్విచక్ర వాహనంపై వచ్చారు. పనులు పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణంలో వెళ్తుండగా రంగసాయి వాగు సమీపంలో ఎదురుగా ద్విచక్ర వాహనంపై ముగ్గురు వస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంలో ఉన్న వ్యక్తులు కింద పడిపోయారు. ప్రమాదం జరిగిన వెంటనే అటు ప్రయాణిస్తున్న ప్రయాణికులు వారి వాహనంలో అంగలకుర్తి సూరిబాబును రవిని కొండపి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొని వచ్చారు. గుర్తు తెలియని ముగ్గురు ఓ ప్రైవేటు వైద్యశాలకు వెళ్లడంతో అక్కడ వారు ఒంగోలుకి రిఫర్ చేయడంతో వెంటనే వారు ప్రైవేట్ వాహనంలో ఒంగోలుకు వెళ్లారు. సూరిబాబు తలకు గాయాలు కావడంతో తలకు కుట్లు పడ్డాయి. రవికి స్వల్ప గాయాలయ్యాయి.

ఉసూరుమని 'పింఛెన్'

- ఈఏడాది ఆగస్టు వరకు కొత్త పింఛన్లు లేనట్లే


కనిగిరిలో పింఛన్ల పంపిణీ చేస్తున్న అధికారులు (ఫైల్)

కనిగిరిరూరల్: కూటమి సర్కార్ ఏర్పడి ఎనిమిది నెలలు దాటినా నేటి కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో ఉసూరుమంటున్నారు. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టు వరకు కొత్త పింఛన్లు మంజూరు చేసే పరిస్థితి కన్పించడం లేదు. దీంతో అర్హులైన పింఛన్ దారుల పరిస్థితి వర్ణణాతీతంగా మారింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏడాదికి రెండుసార్లు కొత్త పింఛన్లు మంజూరు చేశారు. అర్హత కల్గిన వారందరికి పార్టీల కతీతంగా ఇంటికి వెళ్లి పింఛన్ నగదు ప్రతి నెల 1వ తేదీన ఠంచనుగా అందజేశారు. కానీ నేటి కూటమి సర్కారులో ఆపరిస్థితి లేదు. దీంతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలను ఎదుర్కొంటోంది. ఇప్పటికే ప్రతి నెల కొందరు పింఛన్‌దారులను రాష్ట్ర ప్రభుత్వం తొలగిస్తోంది. పింఛన్‌ల వెరిఫికేషన్ పేరుతో వారంలో మూడు రోజులు అధికారులు తిరుగుతున్నారు. ఈ ప్రక్రియ ఫిబ్రవరిలో కూడా కొన సాగుతుందని అధికారులు చెప్తున్నారు.

పింఛన్ల తొలగింపుకు కుట్ర..

నియోజకవర్గంలో ఫిబ్రవరి జాబితాలో 37,688 మంది పింఛన్ దారులు మాత్రమే ఉన్నారు. కనిగిరి మున్సిపాలిటీలోని 12 సచివాలయాల్లో జనవరిలో 4,243 పింఛన్లు ఉండగా ఫిబ్రవరి 1న 4,229 పింఛన్లు మాత్రమే పంపిణీ జాబితాలో వచ్చాయి. కనిగిరి రూరల్ మండలంలో జనవరి నెలలో 6,589 పింఛన్ లబ్ధిదారులుండగా.. ఫిబ్రవరి నెలకు 6563 పింఛన్లు తగ్గి వచ్చాయి. మిగతా ఆరు మండలాల్లో కూడా పింఛన్ లబ్ధిదారుల సంఖ్య తగ్గాయి.

రచ్చబండ పైనే ఫింఛన్ల పంపిణీ..

సింగరాయకొండ: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతి నెల ఒకటో తేదీ పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఫింఛన్‌దారులకు ప్రహసనంగా మారింది. ప్రతినెల లాగానే శనివారం ఈనెల పింఛన్‌ను కనుమళ్ల పంచాయతీ చిన్న కనుమళ్లలోని వడ్డెపాలెం సెంటర్‌లో రచ్చబండ వద్ద గ్రామ ఇంజినీరింగ్ అసిస్టెంట్ నీలిమ పంపిణీ చేసింది. పింఛన్‌దారులు మాత్రం నడవలేని వారికి మాత్రమే ఇంటికి వచ్చి ఇస్తున్నారని నడిచే వారికి రచ్చబండ వద్దే ఇస్తారని తెలియజేస్తున్నారు. కనుమళ్లతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఇదే తంతు నడుస్తుందని, ఇంటి పంపిణీ కార్యక్రమం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తోనే మర్చిపోవాలని పింఛన్‌దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యతోపాటు నైతిక విలువలూ ముఖ్యం


బహుమతులు అందజేస్తున్న పార్థసారథి, నాయకులు

సీఎస్‌పురం (పామూరు): విద్యార్థులకు విద్యతోపాటు నైతిక విలువలు కూడా ముఖ్యమని కదిరి బాబూరావు విద్యా సంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ కదిరి పార్థసారథి, వైఎస్సార్ సీపీ మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్.బుజ్జిలు అన్నారు. మండలలోని శీలంవారిపల్లె కదిరి బాబూరావు ఉద్యాన కళాశాలలో శనివారం ఉద్యాన కళాశాల 2024–25లో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ పి.వీరన్నగౌడ్, సర్పంచ్ షేక్.ఖాదర్‌బీ బుజ్జి, ఉప సర్పంచ్ టి.బాబూరావు, మాజీ ఎంపీటీసీ మునగల నారాయణరెడ్డి, నున్నా నారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


మృతురాలు గంగాదేవి

సీఎస్‌పురం (పామూరు): చింతచెట్టుపై కాయలు కోస్తూ ప్రమాదవశాత్తు జారిపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని ఎగువపల్లె గ్రామానికి చెందిన రామిశెట్టి గంగాదేవి (47) ఈనెల 16వ తేదీన గ్రామంలోని చింతచెట్టుపై కాయలుకోస్తూ ప్రమాదవశాత్తు జారి కిందపడింది. క్షతగాత్రురాలిని వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స కోసం చెన్నైలోని వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గంగాదేవి మృతిచెందింది. దీనిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్ చెన్నై వెళ్లి మృతిపై వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చారు. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి


రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో చిరంజీవి

పొన్నలూరు: అర్జీల రూపంలో వచ్చే ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జెడ్పీ సీఈవో చిరంజీవి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించి పలు రికార్డులను, రిజిస్టర్లను, కార్యాలయం ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం జెడ్పీ సీఈవో మాట్లాడుతూ సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా పనిచేసి ప్రజలకు జవాబుదారిగా ఉండాలన్నారు. ప్రతి రోజూ సమయ పాలన పాటించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధులు మండల కాంప్లెక్స్ పరిధిలోని అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని జెడ్పీ సీఈవోకి విన్నవించారు.

సృజనాత్మక విద్య అవసరం

పొన్నలూరు: ఉపాధ్యాయులు విద్యార్థులకు సృజనాత్మకమైన విద్యను బోధించాలని మండల ప్రత్యేక అధికారిణి వరలక్ష్మి అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలను శనివారం ఆమె సందర్శించారు. ముందుగా పాఠశాల పరిసరాలు, తరగతి గదులను, విద్యార్థుల హాజరు పట్టిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బోధనోపకరణాలను వినియోగించి నూతన పద్ధతులతో అర్థవంతంగా పాఠ్యాంశాలను బోధించాలన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ సుజాత, పంచాయతీ కార్యదర్శి నారాయణ ఉన్నారు.